

డిజిపిని కలిసిన ఎస్పీ



డిజిపికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా నూతన ఎస్పీ ఎన్.సతీష్‌కుమార్ బుధవారం విజయవాడలోని డిజిపి కార్యాలయంలో రాష్ట్ర డిజిపి హరీష్‌కుమార్‌గుప్తాని మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఎస్పీ గత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వెంటనే మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష సమావేశంలో పాల్గొనేందుకు విజయవాడ వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్పీ బుధవారం రాత్రి డిజిపిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

తీరని 'హార్మోన్' కష్టాలు..!

◆ పని చేయించుకుని బిల్లులివ్వని వైనం

◆ పోలీసులను ఆశ్రయించిన బాధితులు



హార్మోన్ సిటీలో నిర్మాణాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

హార్మోన్ సిటీలో స్థలం కొనుగోలు చేసిన వారు ఎప్పుడు మౌలిక సదుపాయాలు కల్పిస్తారా అంటూ ఎదురు చూశారు. ఇప్పుడేమో అక్కడ పనిచేసిన వారు బిల్లులు మంజూరు చేయండి మహాప్రభో అంటూ బయటకొచ్చి ఆవేదన వెల్లబుచ్చారు. తమకు న్యాయం చేయించాలని పోలీసులను ఆశ్రయించి గోడు వెల్లబోసుకున్నారు. అనంతపురం నగరానికి సమీపంలో ఏర్పాటు చేస్తున్న హార్మోన్ సిటీ నిర్మాణ పనులు చేపట్టాలని కొంత మందికి కాంట్రాక్టు ఇచ్చారు. అయినా పనులు చేసినా దానికి బిల్లులివ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని సోమవారం నాడు జిల్లా ఎస్పీ గ్రీవెన్స్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. ఇదే విషయంపై బుధవారం నాడు అనంతపురం రూరల్ పోలీసులకూ ఫిర్యాదు చేసి న్యాయం చేయాలని కోరారు.

రూ.87 లక్షలు ఇవ్వాలి

హార్మోన్ సిటిలో విల్లాల నిర్మాణ పనులను చేపట్టే బాధ్యతను గుంటూరుకు చెందిన విశ్వేశ్వరయ్య కన్‌స్ట్రక్షన్‌కు అప్పగించారు. వారు కొంత పని చేశాక డబ్బులు ఇవ్వలేదు. దీంతో పనులను ఆ సంస్థ ఆపేసింది. బిల్లులు చెల్లిస్తే తక్కిన పనిచేస్తామని చెప్పడంతో సంస్థ ఇవ్వకుండా జాప్యం చేసింది. బిల్లులు ఇవ్వకపోవడంతో ఈ ఏడాది మార్చిలో సంస్థ ప్రతినిధి రామారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సమక్షంలో డబ్బులు చెల్లిస్తానని హార్మోన్ సిటీ ప్రతినిధి రవికుమార్ చెప్పారు. హామీ ఇచ్చినా ఇప్పటి వరకు బిల్లులు ఇవ్వలేదు. దీంతో రామారావు ఈ సోమవారం నాడు అనంతపురం జిల్లా ఎస్పీ కార్యాలయం గ్రీవెన్స్‌లో దీనిపై మరోసారి ఫిర్యాదు చేశారు. ఈయనతో పాటు స్థానికంగానున్న మరో బిల్డర్ కూడా హార్మోన్ సిటీలో ట్యాంకుల నిర్మాణ పనులు చేపట్టి బిల్లులు ఇవ్వకపోవడంతో ఆయన కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అంత పెద్ద వారే అయినా తప్పని ఎదురు చూపు

కార్బన్ హార్మోన్ సిటి ఏర్పాటు సమయంలో పెద్దపెద్ద ఐటి పరిశ్రమలు వస్తాయంటూ ప్రజాప్రతినిధుల చేత మీడియా సమావేశాలు ఏర్పాటు చేయించి ప్రకటనలు చేయించారు. పెద్దఎత్తున డబ్బున్న వాళ్లందరూ ఇక్కడ స్థలాలు, విల్లాలకు డబ్బులు కట్టారు. వైద్యులు, పోలీసు అధికారుల బంధవులు ఇలా అనేక మంది ఉన్నారు. కట్టిన తరువాత తీరా చూస్తే సంవత్సరాలు గడుస్తున్నా పనులు మాత్రం ముందుకు సాగలేదు. కొన్ని నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయాయి. కొంత మంది ఆగిన నిర్మాణాలను నేరుగా కొనుగోలు చేసిన వారు అదనంగా ఖర్చు పెట్టుకుని కొనసాగించుకుంటున్నారు. మరికొంత మంది నిర్మాణాలు ఎప్పుడు పూర్తవుతాయోనని ఎదురు చూపులు చూసుకుంటూ కూర్చొన్నారు. డబ్బు కట్టిన వారి పరిస్థితి ఈ విధంగా ఉండగా, నిర్మాణాలు చేపట్టేందుకు వచ్చిన వారికి డబ్బులందక ఇబ్బందులు పడుతున్నారు. అటు నిర్మాణ పనులు.. ఇటు బిల్లుల చెల్లింపు ఎప్పటికి పూర్తవుతుందో అంటూ అందులో విల్లాలు కొన్న లబ్ధిదారులు, పనులు చేయించిన గుత్తేదారులు ఎదురు చూస్తున్నారు.

విద్యారంగ సమస్యలపై నిర్లక్ష్యం

◆ ప్రభుత్వ విద్య, ఆర్థిక సమస్యలపై స్పందించాలి

◆ మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

◆ శ్రీసత్యసాయి జిల్లాలో కొనసాగిన యుటిఎఫ్ రణభేరి



పెనుకొండ రణభేరి కార్యక్రమంలో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు



కదిరిలో రణభేరి ప్రచారజాతాను నిర్వహిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్,కదిరి టౌన్

ప్రభుత్వ విద్యారంగం, ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవకహరిస్తోందని మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్ విమర్శించారు. ప్రభుత్వ విద్యారంగం, ఆర్థిక సంబంధిత సమస్యల పరిష్కారం కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రణభేరి ప్రచార జాతా కార్యక్రమంలో బుధవారం శ్రీసత్యసాయి జిల్లాలో కొనసాగింది. పెనుకొండ, సోమందేపల్లి, గోరంట్ల, కదిరి ప్రాంతాల్లో యాత్ర కొనసాగింది. పెనుకొండలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన రణభేరి కార్యక్రమాన్ని గేయానంద్‌తో పాటు యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి పి.లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్‌లు రణభేరి డంఖాను మోగించి ప్రారంభించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి పట్టణ పురవీధుల్లో బైకు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గేయానంద్, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు విద్యారంగాన్ని పరిరక్షిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక సంబంధిత సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్నా ఇవి పరిష్కారానికి నోచుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులకు ఇప్పటికీ ఒక్క డీఏ కూడా ఈ ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. 12వ పిఆర్‌సిని నియమించి 30శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు. ఉపాధ్యాయులతో చేయిస్తున్న బోధనేతర పనులు అన్నింటి నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. ఎఫ్ఎ-1 పరీక్షల నిర్వహణ, మూల్యాంకనాన్ని పాత పద్ధతిలనే చేయాలన్నారు. ఈ సమస్యలన్నింటిపై కూటమి ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 25వ తేదీన గుంటూరులో మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నిరసనలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.భూతన్న, ఉపాధ్యక్షులు జిహెచ్.బాబు, రాష్ట్ర కౌన్సిలర్ మారుతి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శులు ఈ.నారాయణ స్వామి, లక్ష్మీనారాయణ, జిసి.నరేష్ కుమార్, నరసింహప్ప, ఆర్.రామకృష్ణ నాయక్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ మహంతిష్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోధనేతర పనులు భారం వద్ద

కదిరి టౌన్ : విద్యార్థులకు పాఠాలు చెప్పే పనులు కాకుండా ఉపాధ్యాయులపై భోధనేతర భారాన్ని మోపడం సరికాదని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్ తెలిపారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రణభేరి కార్యక్రమంలో బుధవారం సాయంత్రం కదిరికి చేరుకుంది. కదిరి పట్టణంలోని కోనేరు నుంచి రణభేరి జాతా ప్రారంభం అయ్యింది. హిందూపురం క్రాస్, టవర్ క్లాక్ సర్కిల్, వేమారెడ్డి సర్కిల్, అంబేద్కర్ సర్కిల్, ఇందిరా సర్కిల్ మీదుగా బాలికల ఉన్నత పాఠశాల వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ బాబు, రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మి రాజా, శెట్టిపి జయచంద్ర రెడ్డిలు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నప్పటికీ పెండింగులో ఉన్న ఒక్క డీఏ కూడా ఇవ్వలేదన్నారు. 30 శాతం ఐఆర్‌ను పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, జిల్లా కోశాధికారి డి.శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు చెన్నూరు తాహెర్ వలి, వైవి.సుబ్బారెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు మల్లికార్జున ఆజం బాషా, సంతోష్ కుమార్, నాయకులు మధుసూదన్, రాజేష్, రవివర్ధన్ రెడ్డి, నజీర్, రమణ నాయక్, ఖాజాపీర్ తదితరులు పాల్గొన్నారు.



ఆగిపోయిన మెడికల్ కళాశాల భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

పిపిపి మాటున ప్రయివేటుకు మెడికల్ కళాశాలలు

మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్

ప్రజాశక్తి-పెనుకొండ

పిపిపి పేరుతో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రయివేటు పరం చేసే కుట్ర చేస్తోందని మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్ విమర్శించారు. మెడికల్ కళాశాలలను ప్రయివేటుకు కట్టబెట్టే ఆలోచనను మానుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ సమీపంలోని షీఫారం వద్ద ఆగిపోయిన మెడికల్ కళాశాల నిర్మాణ పనులను ప్రజా సంఘాల నాయకులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023లో గత ప్రభుత్వం వైద్య కళాశాల నిర్మాణ పనులను ప్రారంభించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయానికి సుమారు రూ.30 కోట్ల నిధులు దీని కోసం ఖర్చు చేసిందన్నారు. ఇంత ఖర్చు పెట్టి ఇప్పుడు పిపిపి పేరుతో ప్రయివేటుకు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల అవసరం అటు ప్రజలు, ఇటు విద్యార్థులకు చాలా ఉందన్నారు. కోవిడ్ వచ్చినప్పుడు ప్రభుత్వ ఆసుపత్రులు, మెడికల్ కళాశాలలు ప్రజలను ఆందుకున్నాయని గుర్తు చేశారు. మెడికల్ కళాశాలలు ప్రయివేటు పరం అయితే ఫీజుల భారం అధికం అయ్యి పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరం అవుతారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వమే మెడికల్ కళాశాలలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గంగాధర, వెంకటరాముడు, సిఐటియు జిల్లా నాయకులు నాగరాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు చిరంజీవి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు నరసింహులు, ఆనంద్ పాల్గొన్నారు.

రోడ్లను ఆక్రమిస్తే చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో బెంగళూరు రోడ్డు, గురునాథ టాకీస్ రోడ్డు తదితర ప్రాంతాలలో బ్యాంకులు ముందు అత్యధికంగా ద్విచక్ర వాహనాలు నిలబెట్టడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, ఇలాగే కొనసాగితే ఆయా బ్యాంకు నిర్వాహకులతో పాటు ఆ భవన యజమానులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున హెచ్చరించారు. బుధవారం నాడు మున్సిపల్ కమిషనర్ ఛాంబర్‌లో వివిధ బ్యాంక్ అధికారులతో పాటు ఆయా భవన యజమానులతో మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్, బాలయ్య పిఎ వీరయ్యలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యధికంగా బెంగళూరు రోడ్డులోని బ్యాంకులు ఉండడంతో జనసంచారం ఎక్కువగా ఉందన్నారు. బ్యాంకుల ముందు పదుల సంఖ్యలో ద్విచక్ర వాహనాలను నిలపడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. గతంలో బ్యాంక్ అధికారులకు సమస్యను వివరించినప్పటికీ ఎటువంటి మార్పు రాలేదన్నారు. ఇప్పటికైనా ఆయా భవనాల యజమానులు రోడ్లపై ద్విచక్ర వాహనాలు నిలబడకుండా అవసరమైన చర్యలను తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఆయా భవనాల యజమానులతో పాటు బ్యాంకు నిర్వాహకులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పురపాలక శాఖ ఆధీనంలో నూతనంగా రూ. 23 కోట్లు వెచ్చించి పట్టణ నడిబొడ్డున నూతనంగా వాణిజ్య సముదాయ భవనాన్ని నిర్మాణం చేశామని, అందులోని మొదటి అంతస్తులో ఖాళీ గదులను బ్యాంకులకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పురపాలక శాఖ తరపున బ్యాంకు నిర్వహణకు అవసరమైన అన్ని సౌకర్యాలనూ కల్పిస్తామని బ్యాంక్ అధికారులకు భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ చంద్రమ్మ, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అబ్దుల్ సత్తార్, బ్యాంకు అధికారులు, భవన యజమానులు పాల్గొన్నారు.



బ్యాంకు అధికారులు, భవన యజమానులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్

కులవృత్తి గొప్పతనాన్ని చాటిన విశ్వకర్మ

జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్



విశ్వకర్మకు నివాళి అర్పిస్తున్న జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

కులవృత్తి గొప్పతనం, వైభవాన్ని పెంచిన వ్యక్తి విశ్వకర్మ అని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలను నిర్వహించారు. విరాట్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పురాణ సాహిత్యంలో ప్రపంచ తొలి వాస్తుశిల్పి, సృష్టికర్తగా విశ్వకర్మను గుర్తించారన్నారు. కమ్మరి, వడ్రంగి, కాంస్య, కమ్మరులు, స్వర్ణకారులు మొదలైన కులవృత్తుల వారందరినీ విశ్వకర్మ వారసులుగా పరిగణించబడుతుందన్నారు. ఆయా వర్గాల వారు సాంఘికంగా, ఆర్థికంగా, అభివద్ధి పరిచే క్రమంలో కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మ యువజన పథకం ద్వారా లక్షల రూపాయల రుణాలను అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఆర్ఓ సూర్యనారాయణ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి రాజేంద్రకుమార్ రెడ్డి, పరిశ్రమల శాఖ జిఎం నాగరాజు, క్రీడల శాఖ అధికారి ఉదయ్ భాస్కర్, మున్సిపల్ కమిషనర్ క్రాంతి కుమార్, ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బేకరీ గంగాద్రి పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

పుట్టపర్తి రూరల్ : పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో బుధవారం విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఇతర పోలీసు అధికారులు విశ్వకర్మ చిత్రపటా నికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఎఆర్ డీఎస్పీ మాట్లాడుతూ విశ్వకర్మ జయంతిని దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో ప్రజలు భక్తి శ్రద్ధలతో పండుగలా జరుపుకుంటారన్నారు. విశ్వకర్మ భగవానుడు కేవలం దేవతల శిల్పి మాత్రమే కాదు కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో ఏవో సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, ఆర్ఐలు వలి, మహేష్, ఆర్ఎస్ఐలు వీరన్న, వెంకటేశ్వర్లు, ప్రదీప్‌సింగ్, ప్రసాద్, ఎఎస్ఐ శ్రీరాములు, షౌకత్‌వలి, డిపిఒ, ఎఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో చదవండి : కలెక్టర్



వంటగదిని శుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-చిలమత్తూరు

ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని తల్లిదండ్రులు, గురువులు గర్వపడేలా చదవి ఉన్నత శిఖరాలకు ఎదగాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ విద్యార్థులకు సూచించారు. చిలమత్తూరు మండలం టేకులోడు గ్రామంలోని మహాత్మా జ్యోతిబాపూలే ఏపీ రెసిడెన్షియల్ కళాశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో తరగతి గదులు, తాగునీటి సౌకర్యం, స్నానపు గదులు, మరుగుదొడ్లు, వంటశాల, వండిన ఆహార పదార్థాలు, విద్యార్థుల భోజనపు గదిని, పాఠశాల ఆవరణం, మైదానాలను కలియతిరిగారు. అక్కడి సమస్యలు, సౌకర్యాలను గుర్తించారు. విద్యా బోధనపై విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. కళాశాల స్వచ్ఛ ఆంధ్రకు ఎంపికైనా నేపథ్యంలో పారిశుధ్యాన్ని పక్కాగా అమలు పరచాలని, కళాశాల తరగతి గదులు, ఆవరణ, వంట గదులు, మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శోభారాణి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో కరాటే మాస్టర్లు

రాష్ట్రస్థాయి పోటీలకు 11 మంది ఎంపిక

ప్రజాశక్తి-హిందూపురం

అనంతపురం ఆర్‌డిటి ఇండోర్ స్టేడియంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో హిందూపురం ప్రాంతానికి చెందిన 11 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఉమ్మడి అనంతపురం జిల్లా పోటీల ఎంపికలో హిందూపురంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. విద్యార్థులు ఎస్.రియాజ్, ఎస్.సయ్యద్, ఎస్.శోభన్, టి.నేహ, డి.గ్రీష్మిత, ఎన్.మమత, ఎన్.ధనంజయ, షేక్ యాహియా, ఎంయు.అబ్దుల్లా ఖాన్, ఎన్.దీక్షిత్, సాహిల్, డి.శ్రీ చరణ్ మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపికయ్యారు. యాసీన్ తాజ్, తయ్యబా తహసీన, జాన్ విక్టర్, సాజిద్ ఖాన్, హితేష్ దత్త, అభిలాష్, వరాహ శివశంకర్, తిరుమలేష్‌లు రెండో స్థానంలో నిలిచారు. కార్తికేయ, నిఖిలేంద్ర, జైద్, రిషిరామ్, అనాస్, పిఎండి.జైద్, హిమవర్షిత, సుప్రియ తతీయ స్థానంలో నిలిచారు.

బాలయ్య ఇలాఖాలో తమ్ముళ్ల సిండికేట్..!

రూ. 15 లక్షలు విలువజేసే చెరువు సంపద రూ.2 లక్షలకే కైవసం



బహిరంగ వేలం నిర్వహిస్తున్న డిఈ శైలేశ్వర్

ప్రజాశక్తి-హిందూపురం

నందమూరి బాలకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురంలో తమ్ముళ్ల సిండికేట్ అయ్యారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ తక్కువకే చెరువు సంపదను దక్కించుకున్నారు. సుమారు రూ.15 లక్షలు విలువజేసే చెరువు సంపదను కేవలం రూ.2 లక్షలకే కైవసం చేసుకున్నారు. ఈ వ్యవహారంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. హిందూపురం పట్టణం శ్రీకంఠపురం చెరువులో ఉన్న నల్లతుమ్మ చెట్లను నీటిపారుదల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శైలేశ్వర్ ఆధ్వర్యంలో బుధవారం నాడు శ్రీకంఠాపురం చెరువు కట్ట ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహించారు. దాదాపు రూ. 10 లక్షల వరకు విలువజేసే చెరువు సంపదను నీటిపారుదల సంఘం అధ్యక్షులు, అధికార పార్టీ నాయకులు కలిసి తక్కువ ధరకే దక్కించుకునే ఎత్తుగడ వేసి అందులో సఫలీకృతులయ్యారు. శ్రీకట్టపురం చెరువులో 530 నల్లతుమ్మ చెట్లు ఎండిపోయినట్లు గుర్తించి గుర్తించిన నీటి పారుదల శాఖ అధికారులు అటవీ శాఖ అధికారుల అనుమతులతో బహిరంగ వేలం వేయడానికి అనుమతులు పొందారు. గత నెల రోజుల నుంచి ఈ బహిరంగ వేలం వాయిదా పడుతూ వస్తోంది. చివరికి బుధవారం నాడు వేలం పాట నిర్వహించారు. ఇందులో రూ.2 లక్షల సర్కారీ వారి పాటతో బహిరంగ వేలాన్ని డిఈ శైలేశ్వర్ ప్రారంభించారు. వేలంలో స్థానికులు 8 మంది మాత్రమే పాల్గొన్నారు. గతంలో బహిరంగ వేలం నిర్వహించిన సమయంలో పట్టణంలో ఉన్న సామిల్ నిర్వాహకులు చాలామంది పాల్గొనేవారు. ప్రస్తుతం జరిగిన బహిరంగ వేలానికి సామిల్ నిర్వాహకులు ఎవరూ రాలేదు. వీరందరూ వేలంలో పాల్గొనకుండా అధికార పార్టీ నేతలు కట్టడి చేసినట్లు ప్రచారం నడుస్తోంది. చెరువులో ఉన్న 530 నల్ల తుమ్మ చెట్లకు 44 టన్నులు కలప లభిస్తుందని అంచనా వేసి అధికారులు దాని విలువ రూ. 2 లక్షలుగా నిర్ణయించారు. అయితే బహిరంగ మార్కెట్‌లో ఒక్క చెట్టు విలువ రూ.3000 ప్రకారం సుమారు రూ. 15 లక్షలు విలువజేస్తుందని అంచనాగా ఉంది. ఇంత విలువజేసే చెరువు సంపదను అధికార పార్టీ నాయకులు, నీటిపారుదల సంఘం అధ్యక్షులతో కలిసి సర్కారు వారి పాట రూ.2లక్షలకు అదనంగా కేవలం రూ.23 వేలు మాత్రమే పాడి శివయ్య అనే వ్యక్తి దక్కించుకున్నారు. సుమారు రూ.15 లక్షలు విలువజేసే చెరువు సంపదను కేవలం రూ.2.23 లక్షలకు దక్కించుకోవడంలో భారీగా అధికార మంత్రాంగం నడిచినట్లు తెలుస్తోంది. ఈ వేలం నిర్వహణపై జిల్లా స్థాయి అధికారులు సమగ్ర విచారణ చేపడితే భారీ అవినీతి బయటపడడమే కాకుండా, ప్రభుత్వ ఖజానాకు లక్షల్లో గండిపడిన అంశం వెలుగు చూసే అవకాశం ఉందని పలువురు చర్చించుకుంటున్నారు.

మోడల్ కాలనీ-2లో పర్యటన

ప్రజాశక్తి-హిందూపురం

మున్సిపల్ పరిధిలోని మోడల్ కాలనీ -2 లో మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్ అధికారులతో కలిసి పర్యటించారు. ఛైర్మన్‌తో పాటు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు వీరయ్య, శ్రీనివాసరావు, బాలాజీలు కాలనీలో పర్యటిస్తూ ప్రజలతో నేరుగా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మోడల్ కాలనీ-2లో ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో త్వరలో రూ.92.5 కోట్లతో వార్డుల్లో అభివృద్ధి పనులు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రహమత్ బీ, టీడీపీ పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, 11వ వార్డు ఇన్‌ఛార్జి అరుణమ్మ, టీడీపీ నాయకులు మురళీ దేశాయ్, రామాంజినేయులు, అయూబ్ ఖాన్, దస్తగిరి, లోకేష్, గంగాధర్, మజీద్ ఖాన్, మున్సిపల్ ఇంజినీర్ దస్తగిరి, డిఈఈ. మదన్ కుమార్, ఏఈ. జనార్ధన్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వేరుశనగ పొలంలో కొండ చిలువ



పొలంలో ఉన్న కొండచిలువ

ప్రజాశక్తి-తలుపుల

మండలంలోని గజ్జలప్ప గారి పల్లి గ్రామ సమీపంలోని వేరుశనగ పొలంలో బుధవారం స్థానికులు కొండ చిలువను గుర్తించారు. వారిచ్చిన సమాచారంతో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నరసింహమూర్తి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కొండచిలువను పట్టి గోనెసంచిలో వేసి సురక్షితంగా అటవీ ప్రాంతంలోకి వదిలిపెట్టారు.

ఆక్రమణల తొలగింపులో అధికారుల నిర్లక్ష్యం..!

ప్రజాశక్తి-కొత్తచెరువు

కొత్తచెరువులోని ప్రధాన రహదారుల్లో ఆక్రమణల తొలగింపునకు రెండు నెలల క్రితం అధికారు లు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా పుట్టపర్తి రోడ్డు, ధర్మవరం రోడ్డు, పెనుకొండ రహదారుల్లోని ఆర్ అండ్ బి స్థలాల్లో ఉన్న ఆక్రమణలను పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, రెవెన్యూ, పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో జెసిబి, హిటాచిల సాయంతో తొలగింపు పనులు చేపట్టారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి లో ఉన్న సూర్య టవర్స్‌ను పూర్తిగా తొలిగించారు. అయితే మిగిలిన ఆర్ అండ్ బి స్థలాల్లో ఉన్న భవ నాల యజమానులు హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకుంటున్నారు. దీంతో అధికారులు వాటిపై కన్నెత్తి చూడ లేదు. కోర్టు స్టేకి గ్రామపంచాయతీ వారు కౌంటర్ పిటిషన్ వేసి తొలగింపు పనులను కొనసాగించాల్సి ఉంది. అయితే అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్ల మేరకు ఈ తొలగింపు పనులను జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల నాటికి ఈ పనులన్నీ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే కొందరు అధికారుల నిర్లక్ష్యంతో ఈ పనులు ముందుకు సాగడం లేదు. ఇదిలా ఉండగా తమ భవనాలను ఆగమేఘాలపై కూల్చిన అధికారులు మిగిలిన వాటిని ఎందుకు తొలగించలేదని కొందరు ప్రశ్నిస్తున్నారు. ఆక్రమణలను తొలగించకపోతే ఆందోళనలకు వెనుకాడబోమని పట్టణ వాసులు పేర్కొంటున్నారు. ఈ విషయంపై ఆర్ అండ్ బి జేఈ మున్నార్ స్వామిని వివరణ కోరగా ప్రస్తుతం ఆక్రమణలు తొలగించిన ఒక కిలోమీటర్ వరకూ రోడ్డు వేయడానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు.

టిపిఒ అబ్దుల్ సత్తార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-హిందూపురం

గుంతకల్లు పురపాలక సంఘంలో టిపిఒగా విధులు నిర్వహిస్తున్న అబ్దుల్ సత్తార్ అదనపు బాధ్యతల కింద హిందూపురం పురపాలక సంఘానికి ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ నేపథ్యంలో బుధవారం ఆయన హిందూపురంలో బాధ్యతలు స్వీకరించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులను సమన్వయం చేసుకుని పట్టణాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.



అబ్దుల్ సత్తార్



రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న అధికారులు

రైతులకు యూరియా పంపిణీ

ప్రజాశక్తి-గాండ్లపెంట

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వరి సాగు చేసిన ప్రతి రైతుకు యూరియా అందజేస్తామని బుధవారం మండలంలోని గాండ్లపెంట కూర మామిడి రైతు సేవా కేంద్రాలలో యూరియా పంపిణీ కార్యక్రమం చేశామని వ్యవసాయ అధికారి సయ్యద్ షాదాబ్ తెలిపారు ఈ కార్యక్రమానికి తాసిల్దార్ బి బాబురావు ఎంపిపి జి.సోమశేఖర్ రెడ్డి హాజరై రైతులకు యూరియా పంపిణీ చేసి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి రైతుకు యూరియా పంపిణీ చేస్తుందని తెలిపారు గాండ్లపెంట 9.0. టన్నులు కురుమామిడి 3.6. టన్నులు యూరియా రైతులకు అందజేశావని మిగిలిన రైతు సేవ కేంద్రాలలో అందుబాటులో ఉందని వారు తెలిపారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ సిబ్బంది రాజేష్, ఫైరోజ్, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు ఏ వెంకటరమణారెడ్డి డి ఆనంద్ అక్రమ భాష పవన్ కుమార్ ఎస్ వి సికిందర్ రైతులు తదితరులు పాల్గొన్నారు

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ధన్వంతరి జయంత్యుత్సవం సందర్భంగా 2024-25 విద్యా సంవత్సరానికి నాయీ బ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని, ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సాంస్కృతిక సంక్షేమ సంఘం ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షులు వెంకటరంగయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో 480కి పైగా, ప్రైవేటు పాఠశాలల్లో 520కిపైగా ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్‌లో 850కి పైగా, ప్రైవేటు కళాశాలల్లో 900కు పైగా మార్పులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. వివరాలకు 94412 22874లో సంప్రదించాలన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి : ఏవో

ప్రజాశక్తి- చెన్నేకొత్తపల్లి

మండలంలోని నామాల గ్రామంలో బుధవారం ఏవో మురళీకృష్ణ ఆధ్వర్యంలో పొలం పిలు స్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ వేరుశనగ, కంది, తదితర ప్రతి పంటలు సాగు చేసిన రైతులు తమ గ్రామంలోని ఎంపిఇఒల ద్వారా తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేయించుకో వాలన్నారు. అలాగే రైతులు పంటలకు యూరియా వాడకాన్ని తగ్గించుకొని నానో యూరియా వాడాల న్నారు. పశువుల ఎరువుని బాగా వాడి భూమిని సారవంతం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ధర్మవరం ఎడిఎ లక్ష్మీనాయక్, ఎంపిఇఒ రామ్మోహన్, రైతులు పాల్గొన్నారు.

జెవివి విద్యా కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా మహేందర్‌రెడ్డి

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు



ఈ నెల 13, 14 తేదీల్లో విజయ నగరంలో జరిగిన జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభల్లో ఓడిసి జడ్పీ హైస్కూల్‌లో పని చేస్తున్న ఫిజిక్స్ ఉపాధ్యాయుడు ఎన్. మహేంద్ర రెడ్డిని జెవివి రాష్ట్ర విద్యా కమిటీ కోకన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. జెవివి రాష్ట్ర కమిటీకి ఆయన ధన్య వాదాలు తెలిపారు. ప్రస్తుతం విద్యా రంగంలో వస్తున్న పెను మార్పులు, పర్యవసనాలు, అధ్యయనం చేసి పరిష్కార మార్గాలు అన్వేషిస్తామని, విద్యారంగం లో ఒత్తిడి లేని విద్యా విధానంపై కృషి చేస్తామని తెలిపారు. అలాగే ధర్మవరం పట్టణానికి చెందిన డాక్టర్ ఆదిశేషును రాష్ట్ర కార్యదర్శిగా ఎంపిక చేశారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి-తాడిమర్రి

స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో బుధవారం 2025 పోషణ మాసోత్సవం నిర్వహించారు. పిహెచ్‌సి డాక్టర్ హరిత, సూపర్వైజర్ లలితమ్మ మాట్లాడుతూ అక్టోబర్ 16వ తేదీ వరకూ ఈ మాసోత్సవాలు నిర్వహిస్తామన్నారు. దాడితోట సెక్టార్‌లోని చిల్లకొండయ్యపల్లి గ్రామంలో పోషణ మాసోత్సవం, పెద్దకోట్ల సచివాలయ మహిళా పోలీస్ మీనా ఆధ్వర్యంలో అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. అలాగే పిల్లలు, గర్భిణులు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అంగన్వాడీ సిబ్బంది ఆదెమ్మ, లక్ష్మీకాంతమ్మ తెలిపారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, తల్లులు, పిల్లలు, గర్భిణులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : పోషణ మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని మల్లమీదపల్లి, కోటూరు, తదితర గ్రామాల్లో అంగన్వాడీ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడీ టీచర్ లక్ష్మీదేవి ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సుకన్య, గర్భిణులు, బాలింతలు, పిల్లలు, ప్రజలు పాల్గొన్నారు.



తాడిమర్రిలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీలు

సిఐటియు నేతపై దాడి హేయం

సిపిఎం, సిఐటియు, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్‌పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు బుధవారం వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. ఈఎస్ వెంకటేష్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంకటేష్‌పై దాడి చేసిన వెలుగు సిసి రవీంద్ర, బుక్ కీపర్ నాగరాజుపై డిఆర్‌డిఎ పిడితో పాటు పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ప్రకటనలు విడుదల చేసిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి సి.రామకృష్ణ, జిల్లా రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెనుకొండ హరి, జంగాలపల్లి పెద్దన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, ప్రవీణ్, సిఐటియు జిల్లా నాయకులు జడ్పి శ్రీనివాసులు, బ్యాల్లా అంజి ఉన్నారు.

నల్లమాడ : సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్‌పై దాడిని మండల సిపిఎం నాయకులు ఖండించారు. వారు మాట్లాడుతూ దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమం సిపిఎం నాయకులు గోవిందు, మల్లికార్జున, రామయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేశ్‌పై దాడి హేయమని స్థానిక సిపిఎం, సిఐటియు, ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. ముదిగుబ్బలో వారు విలేకరుల సమావేశంలో మాట్లా డుతూ ఈఎస్.వెంకటేష్‌పై దాడిని తీవ్రంగా ఖండించారు. డ్వాక్రా మహిళలకు సంబంధించి లక్షలాది రూపాయలు స్వాహా చేసిన విషయంలో ప్రశ్నించడానికి వెళ్లిన సిపిఎం, సిఐటియు నాయకులపై వెలు గు సీసీ దాడి చేయడం ఎంతవరకూ సమంజసం అని ప్రశ్నించారు. దాడి చేసిన సీసీ రవీంద్రపై కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే నాగరాజు అనే వ్యక్తిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిచో జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

హిందూపురం : బుక్కపట్నం శ్రీ సంతోషిమాత పొదుపు సంఘంలో జరిగిన అవినీతి కార్యకలాపాల వ్యవహారంలో ప్రశ్నించిన సిపిఎం జిల్లా నాయకులపై దాడికి పాల్పడిన సీసీపై వెంటనే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్పీ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బుక్కపట్నం శ్రీ సంతోషిమాత పొదుపు సంఘంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సంఘం సభ్యురాలు కోమల ఆమె కుటుంబ సభ్యులు సంఘంలోని ఇతర సభ్యులపై దాడికి యత్నిం చారన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించాలని కోరిన సిపిఎం నాయకులు ఈఎస్.వెంకటేష్‌పై వెలుగు సిసిలు రవీంద్ర, నాగరాజులు దుర్భాషలాడుతూ దాడి చేయడం అత్యంత దుర్మార్గం అన్నారు. తక్షణం వీరిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్'ను సద్వినియోగం చేసుకోండి: జెసి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్



ఎనుములపల్లి పిహెచ్‌సి ఆవరణలో మొక్క నాటిన జెసి అభిషేక్‌కుమార్

మండలంలోని ఎనుములపల్లి పిహెచ్‌సిలో బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్' అభియాన్ పోస్టర్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆవిష్కరించారు. అలాగే 'ఒక తల్లి-ఒక మొక్క' కార్యక్రమంలో భాగంగా జెసి మొక్క నాటారు. అలాగే ఆర్డీవో సువర్ణ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు, చంటి పిల్లలకు అన్న ప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. బాల, బాలికలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణ ధ్యేయంగా పని చేస్తున్న ఐసిడిఎస్ సేవలను ఆర్డీవో కొనియాడారు. ఐసిడిఎస్ పిడి ప్రమీల మాట్లా డుతూ మహిళలు పోషక పదార్థాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అంగన్వాడీ కార్యకర్తల సల హాలు, సూచనలు పాటించి ఆరోగ్యకరమైన బిడ్డకు జన్మనివ్వాలని, తద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. రాష్ట్ర నోడల్ ఆఫీసర్, అడిషనల్ డైరెక్టర్ అనిల్ కుమార్, డిఎంహెచ్ఒ ఫిరోజ్‌బేగం మాట్లాడారు. ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు సందేశాన్ని సభలో వినిపించారు. కార్యక్ర మంలో ఈ సెల్ఫీ పాయింట్ ప్రత్యేకంగా నిలిచింది. అనంతరం పిఎంజెవై కార్డులు పంపిణీ చేశారు. వైద్య శిబిరం నిర్వహించారు, మహిళలకు బీపీ షుగర్ పరీక్షలు, క్యాన్సర్ సంబంధిత పరీక్షలు నిర్వహించారు. 'ఒక తల్లి-ఒక మొక్క' కార్యక్రమంలో భాగంగా పిహెచ్‌సి ప్రాంగణంలో మెక్కలు నాటారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ ఫిరోజ్‌బేగం, ఆర్డీఓ సువర్ణ, ఐసిడిఎస్ పిడి ప్రమీల, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ నాగేంద్ర, ఐసిడిఎస్ సిబ్బంది సుదీప్, సిడిపిఒ, అంగన్వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దీపికా వేణురెడ్డి

వైసిపిని బలోపేతం చేద్దాం : దీపిక

హిందూపురం : వైసిపి నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో వ్యవహరించి పార్టీని బలోపేతం చేసి విధంగా పని చేద్దామని నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త దీపిక సూచించారు. బుధవారం హిందూపురం రూరల్ మండల పరిధిలోని బాలంపల్లి, చలివెందుల గ్రామ పంచాయతీల్లో వైసిపి గ్రామ పంచాయతీ కమిటీల ఎంపికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పార్టీ అభివృద్ధి, భవిష్యత్తు కార్యక్రమాలపై నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లి లేఅవుట్‌లో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండలంలోని బ్రాహ్మణపల్లి లేఅవుట్‌లో మౌలిక వసతులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.వెంకటేష్ కోరారు. ఆయన మాట్లాడుతూ ఇదే విషయంపై ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వ్యకాసం ఆధ్వర్యంలో ఆర్డీవోకు వినతి పత్రం ఇచ్చినా ప్రయోజనం లేదని వాపోయారు. బ్రాహ్మణపల్లి లేఔట్‌లో 3వేల మందికి సెంటు చొప్పున స్థలం కేటాయించగా సుమారు 1500 మందికి పైగా గృహాలు నిర్మించుకుని నివసిస్తున్నారని తెలిపారు. కాలనీ ఏర్పడి ఏడేళ్లవుతున్నా వీధిలైట్లు, రోడ్లు, తాగునీరు, తదితర మౌలిక వసతులు కల్పించలేదన్నారు. ఈ విషయంపై పలుమార్లు మున్సిపాలిటీ కమిషనర్, ఆర్డీవో, కలెక్టర్‌కు వ్యకాసం ఆధ్వర్యంలో వినతి పత్రాలు ఇచ్చినా ప్రయోజనం లేదన్నారు. ఇకనైనా స్థానిక నాయకులు, అధికారులు స్పందించి వెంటనే మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

'వాహనమిత్ర'కు దరఖాస్తుల ఆహ్వానం

గుడిబండ : అర్హత కలిగిన ఆటో డ్రైవర్లు వాహనమిత్ర కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ కేశవరెడ్డి సూచించారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వం రూ. 15వేలు అందజేస్తుందన్నారు. ఈ నెల 19వ తేదీ లోపు గ్రామ/వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

పశువులకు టీకా తప్పనిసరి

గుడిబండ : పశువులల్లో గాలికుంటు వ్యాధి నివారణకు తప్పని సరిగా టీకా వేయించాలని వైద్యులు అమర్, రవిబాబు, పురుషోత్తం సూచించారు. మండలంలోని చిగతుర్పి గ్రామంలో మంగళవారం 178 పశు వులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేశారు. ప్రతి గ్రామంలో అక్టోబర్ 15వ తేదీ వరకూ ఈ టీకాలు వేస్తారని తెలిపారు.

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం

రొద్దం : స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ రెడ్డి వారి మంజునాథ్‌ను బుధవారం స్థానిక సచివాలయం-1లో ఘనంగా సన్మానించారు. మంత్రి సవిత చొరవతో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత రెడ్డివారి మంజునాథ్ మొట్టమొదటిసారిగా రొద్దం వచ్చారు. దీంతో సచివా లయ సిబ్బంది, మండల టిడిపి నాయకులు పూలమాలలు, శాలువాల తో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోవిందప్ప, టిడిపి మండల కన్వీనర్ ఎం.నరహరి, నాయకులు మారెప్ప, రొద్దం సహకార సంఘం అధ్యక్షులు వీరాంజనేయులు, చంద్రశేఖర్, చెన్నకేశవులు, చిరంజీవి, మండల డీలర్ల సంఘం అధ్యక్షులు సిద్దన్న, రుద్రప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహమూర్తి, నాగార్జున, రఫీ పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో బ్యానర్లు ఏర్పాటు

రొద్దం : ఎన్నికల హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేసింది. దీంతో రాష్ట్ర మంత్రి సవిత ఆదేశాల మేరకు బుధవారం టిడిపి మండల నాయకులు తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల వద్ద 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు టైలర్ ఆంజనేయులు, నరసింహులు, చెన్నకేశవులు, డీలర్ల సంఘం అధ్యక్షులు సిద్దన్న, లింగప్ప, ఫీల్డ్ అసిస్టెంట్లు బాలమురళి, మనోజ్ కుమార్, అనిల్‌కుమార్, ముత్యాలప్ప, నరసింహులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒలింపియాడ్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

ధర్మవరం రూరల్ : ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒలింపియాడ్ పరీక్షల్లో మండలంలోని నాగలూరు గ్రామం వద్ద ఉన్న రూపారాజా పిసిఎంఆర్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఎక్సలెన్స్ మెడల్-4, గోల్డ్ మెడల్-15, సిల్వర్-6, బ్రాంజ్-6 మెడల్స్ సాధించారు. దీంతో బుధవారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఇద్దరు విద్యార్థులకు నగదు బహుమతి, 31మందికి వివిధ పతకాలు అందజేసినట్లు పాఠశాల ఛైర్మన్ హర్షవర్ధన్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ రూపారాజాకృష్ణ, జగదీష్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపల్ నరేష్ కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలను జయప్రదం చేద్దాం

ప్రజాశక్తి-లేపాక్షి



సమావేశమైన కమిటీ సభ్యులు

దసరా సందర్భంగా స్థానిక దుర్గా వీరభద్ర పాపానసేశ్వర ఆల యంలో శరన్నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిద్దామని లేపాక్షి ఆలయ కమిటీ ఛైర్మన్ కరణం రమానందన్ పిలుపు నిచ్చారు. దసరా ఉత్సవాల నిర్వహణపై బుధవారం ఆలయం సమావేశం నిర్వహించారు. ఛైర్మన్ మాట్లాడుతూ శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సహకా రంతో దుర్గా మాతకు ప్రతిరోజూ ఓ అలంకారంలో విశేష పూజలు నిర్వహిస్తామ న్నారు. భక్తులు, యాత్రికులు, పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనం ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రాష్ట్ర టూరిజం డైరెక్టర్‌గా ఎన్నికైన జయప్పను ఘనంగా సన్మానించారు. కార్యక్రమం లో ఆలయ ఈవో నరసింహమూర్తి, నాయకులు అభిలాష్, బాలాజీ, నాయకులు నరసింహమూర్తి, ఆనంద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఎంపిడిఒకు సన్మానం

గోరంట్ల : ఎంపిడిఒ నరేంద్రకుమార్ ఉద్యోగోన్నతిపై ఎపి డిఇఒగా నంద్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో ఆయనను బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో కార్యాలయ ఉద్యోగులు, రాజకీయ నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎంపిడిఒ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సిఐ శేఖర్, టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి, జనసేన మండల అధ్యక్షులు సంతోష్, నాయకులు సోమశేఖర్, లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరసింహులు, సచివాలయ ఉద్యోగులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఆర్‌పిలకు అవగాహన

మడకశిర టౌన్ : పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఛైర్‌పర్సన్ నరసింహరాజు ఆధ్వర్యంలో కమిషనర్ పి.జగన్నాథ్ అధ్యక్షతన ఆర్‌పిలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిఎంఎవైలో భాగంగా పట్టణ గృహ నిర్మాణంకు సంబంధించి అంగీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఈ నెల 27వ తేదీ వరకూ నిర్వహిస్తారని తెలిపారు. పిఎంఎవై కింద ఇల్లు లేని పేదల ఎంపిక, డోర్ టు డోర్ అవగాహన, బ్లడ్ డొనేట్ క్యాంప్, స్కిల్ డెవలప్మెంట్ ఎంటర్‌ప్రైజెస్, ఆర్థిక అక్షరాస్యత, ఫిట్‌నెస్, యోగా, వ్యాసరచన, డ్రాయింగ్, ముగ్గుల పోటీలు, పిఎం ఆవాస్ దివాస్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో కౌన్సిలర్ శంకర్, హౌసింగ్ ఏఈ రఘునందన్, మెప్మా ఉద్యోగి శివ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ధర్మవరం రూరల్ : పట్టణంలోని మార్కెట్ యార్డ్ సబ్ స్టేషన్‌లో గురువారం 33 కెవి లైన్ మరమ్మతుల కారణంగా పట్టణంలోని శివానగర్, శాంతినగర్, కేశవనగర్‌తో పాటు గొట్లూరు, నాగులూరు, మల్లేనిపల్లి, తుమ్మల, తిప్పేపల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ జానకిరామయ్య తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన

ముదిగుబ్బ : రాష్ట్ర జెఎసి పిలుపుమేరకు రెండో రోజైన బుధవారం కూడా ట్రాన్స్‌కో సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని ఏఈ కార్యాలయం ముందు నినాదాలు చేశారు. పెండింగ్ డిఎలు చెల్లించాలని, ఈపిఎఫ్, జిపిఎఫ్ ఇవ్వాలని కోరారు. జెఎల్‌ఎంలకు ఉద్యోగోన్నతులు, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, విద్యుత్ ఉద్యోగుల కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రవి, అశోక్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జైన్ స్కూల్ విద్యార్థులు

కదిరి టౌన్ : అనంతపురంలో ఇటీవల జరిగిన 69వ స్కూల్ గేమ్స్ పోటీల్లో పట్టణంలోని జైన్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు మాస్టర్ షాకీర్ తెలిపారు. జిల్లా స్థాయి అండర్-17 కరాటే, ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో కరాటే అండర్-17 విభాగంలో రబ్బన్, రెహాన్, ఫుట్‌బాల్ విభాగంలో అనస్ పాల్గొంటారన్నారు. వీరిని హెచ్‌ఎం ఉమామహేశ్వర్, ఫరూక్‌బాషా, సిఒఒ సాగర్, కరాటే మాస్టర్ షాకీర్, పిఇటి గంగాద్రి అభినందించారు.

బాలికల జూనియర్ కళాశాల తనిఖీ

ధర్మవరం రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను బుధవారం డిఐఇఒ చెన్నకేశవులు, ఆర్‌జెడి సురేష్‌బాబు సందర్శించి రికార్డుల ను పరిశీలించారు. విద్యార్థుల ప్రగతి గురించి ఆరా తీశారు. వారు మాట్లాడు తూ విద్యార్థినులకు క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యనందిం చాలని సూచించారు. గతేడాది కంటే మెరుగైన ఫలితాలు సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలన్నారు. వారి వెంట ప్రిన్సిపల్ వనితవాణి, అధ్యాపకులు ఉన్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుట వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-గోరంట్ల



పోలీస్ స్టేషన్ ఎదుట ఒంటిపై డీజిల్ పోసుకుంటున్న నరేష్

పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదుట బుధవారం సాయంత్రం నరేష్ ఒంటిపై డీజిల్ పోసుకొని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. వివరాలు.. నరేష్‌పై గతంలో రౌడీషీట్ నమోదవడం తో పాటు హత్యాయత్నం కేసు ఉంది. ఆయా కేసుల విషయంపై నరేష్‌ను పోలీసులు స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతో మనస్థాపానికి గురైన నరేష్ డీజిల్ తెచ్చుకుని స్టేషన్ ఎదుట ఒంటిపై పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా పోలీసులు అడ్డుకున్నారు. స్టేషన్‌కు పిలిపించి కొట్టడం అన్యాయమని నరేష్ వాపోయాడు. ఈ విషయంపై సిఐ శేఖర్ మాట్లాడుతూ రౌడీ షీటర్ నరేష్‌పై గతంలో పలు కేసులు ఉన్నాయన్నారు. ఆయా కేసుల విషయంపై విచారించడానికి స్టేషన్‌కు పిలిపిం చామన్నారు. ఇతడు ఏడాదిగా పరారీలో ఉన్నాడని, ఈ మధ్యనే ఊర్లోకి వచ్చి అల్లర్లు సృష్టిస్తున్నాడ న్నారు. అందువల్లనే కౌన్సెలింగ్ ఇవ్వడానికి నరేష్‌ను స్టేషన్ పిలిపించామన్నారు.

రేపటి నుంచి 'ఓట్ చోర్' నిరసనలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్



తుంపర్తి పరమేష్

డిసిసి అధ్యక్షులు ఇనాయతుల్లా అధ్యక్షతన ఈ నెల 19వ తేదీ నుంచి నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'ఓట్ చోర్-గద్దె చోడ్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ సీనియర్ నాయకులు తుంపర్తి పరమేష్ తెలిపారు. పట్టణంలో బుధవారం ఆయన మాట్లాడుతూ 'ఓట్ చోర్-గద్దె చోడ్' కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు, మిత్రపక్షం, వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు, వైఎస్ఆర్ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాలు జరిగిన అక్రమాలు, అధికారం, వ్యవస్థలను అడ్డం పెట్టుకొని కేంద్రంలో మోడీ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరిస్తామన్నారు. బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా ఇచ్చిన ప్రాథమిక హక్కులను కాలరాస్తున్న విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. అక్టోబర్ 15వ తేదీ వరకూ ధర్మవరం లో ప్రజాభిప్రాయ సంతకాల సేకరణ కార్యక్రమం చేపడతామని తెలిపారు. కావున ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలిచి ప్రజాస్వామ్యన్ని కాపాడాలని తెలిపారు.



కొత్తచెరువులో ర్యాలీ చేపట్టిన శక్తి టీం, సఖి సెంటర్ సిబ్బంది

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

ప్రజాశక్తి-తలుపుల

'బాల్య వివాహాలను నిర్మూలిద్దాం.. బాలల రక్షణ చట్టాలపై అవగాహన కల్పిద్దాం' అని జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ నాగలక్ష్మి సూచించారు. స్థానిక కెజిబివిలో బుధవారం ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కల్పన ఆధ్వర్యంలో బాలికా విద్య, బాల్య వివాహ చట్టం, లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించే చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా విద్యార్థినులను గ్రూపులుగా విభజించి ఆయా చట్టాలపై చర్చించడం ద్వారా అవగాహన కల్పించారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాలికలకు ఎదురయ్యే సమస్యలు, వాటిని ఎదుర్కొనే విషయాలు, చట్టాలు, రక్షణ వ్యవస్థల గురించి వివరించారు. పాఠశాలలో విద్యార్థు లకు సఖి గ్రూపుల ఏర్పాటు ముఖ్య ఉద్దేశాలను తెలిపారు. చివరగా విద్యార్థినుల చేత బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ గౌతమి, డిసిపియు సిబ్బంది నాగలక్ష్మి, ప్రసన్నలక్ష్మి, పాఠశాల సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తచెరువు రూరల్ : మండలంలోని మైలేపల్లి గ్రామంలోని శివసాయి విద్యానికేతన్‌లో పుట్టపర్తి పోలీసుల ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పుట్టపర్తి శక్తి టీం, సఖి సెంటర్ సిబ్బంది ఉమాదేవి, లాయర్ బిందు పారామెడికల్ రమాజ్యోతి బాలల హక్కులు, బాల్యవివాహాలు, పోక్సో, తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ధర్మదేవ్, శక్తి టీం శ్రీనివాసులు, నిర్మల, హెచ్‌ఎం కావ్య, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశానికి హాజరైన అధికారులు ప్రజాప్రతినిధులు

'ఉపాధి' కూలీలకు బిల్లులు చెల్లించండి

సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్

ప్రజాశక్తి-గుడిబండ

ఉపాధి హామీ కూలీలకు తక్షణమే బిల్లులు చెల్లించాలని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలోని మీటింగ్ హాలులో బుధవారం ఎంపిపి రాధమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు శాఖల వారీగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సభ్యులు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉపాధి హామీ కూలీలు పనులు చేసి నెలలు గడుస్తున్నా బిల్లులు చెల్లించలేదన్నారు. దీంతో కూలీలకు కుటుంబ పోషణ భారమైందన్నారు. వెంటనే ప్రభుత్వం బకాయి బిల్లులు చెల్లించి కూలీలను ఆదుకోవా లని డిమాండ్ చేశారు. ఎంపడిఒ కేశవరెడ్డి, ఎపిఒ జగదీష్ స్పందిస్తూ ఇప్పటికే పలువురు కూలీలకు చెల్లించామని, అక్టోబర్ 15వ తేదీ లోపు అందరికీ చెల్లిస్తామని తెలిపారు. సమావేశంలో జెడ్పిటిసి సభ్యులు భూతరాజు, సింగిల్‌విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప, తహశీల్దార్ శ్రీధర్, వైస్ ఎంపిపి రత్నమ్మ, ఈఓఆర్‌డి నాగరాజునాయక్, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

అవయవదాత నవీన్‌కు కన్నీటి వీడ్కోలు

ప్రజాశక్తి-చిలమత్తూరు

ఇటీవల జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో గాయపడి బెంగుళూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నవీన్ అనే యువకుడు బ్రెయిన్ డెడ్ కాగా అతడి తల్లి అంగీకారంతో నవీన్ అవయవాలను దానం చేసిన విషయం తెలిసిందే. నవీన్ మృతదేహం బుధవారం స్వగ్రామమైన తుమ్మలకుంటకు రావడంతో చూసేందుకు మండల వ్యాప్తంగా ప్రజలు వందలాదిగా తరలివచ్చారు. అంతకుముందు కొడికొండ చెక్‌పోస్ట్ నుంచి నవీన్ మృతదేహం ఉన్న వాహనం వెంట పలువురు యువకులు ద్విచక్ర వాహనాల్లో అనుసరించారు. మరవకొత్తపల్లి క్రాస్ మీదుగా తుమ్మలకుంట క్రాస్ వద్దకు చేరుకున్నారు. అక్కడ నవీన్ మృతదేహాన్ని సందర్శనార్థం 2 గంటలు ఉంచారు. ఎమ్మెల్యే బాలక్రిష్ణ ఆదేశాల మేరకు పిఎలు శ్రీనివాసరావు, బాలజీ అంత్యక్రియల ఖర్చులకు నవీన్ తల్లికి రూ. 20వేలు అందజేశారు. ఆమెను పరామర్శించి భరోసా ఇచ్చారు. అనంతరం ఆ నలుగురు ట్రస్ట్ వారి వాహనంలో తుమ్మలకుంట శ్మశనవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.



నవీన్ అంత్యక్రియలకు హాజరైన జనసందోహం